


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JUNE - 2017**

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2017 మే 1, 2, 3 తేదీలలో సామర్లకోట మండలం వెంకటకృష్ణ రాయపురం లాకులవద్దనున్న క్రీస్తుసంఘము సువార్త కూటములు జరిపించగా మొదటిరోజున దొగ్గా ఇశ్రాయేలు రాజు, రెండవ రోజున జాషువాగూటం, మూడవ రోజున యస్. ప్రభాకర్ గారులు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు దొండపాటి రాజారత్నం గారు వారి తండ్రి రవీంద్రనాధ్ గారు మంచిసేవ చేయుచున్నారు.

2017 మే నెల 3,4,5 తేదీలలో నిడసమెట్టలో యున్న క్రీస్తు సంఘము సహో పి.ప్రేమ్‌సుధీర్ గారి ఆధ్వర్యమున గంభీరమైన 51 వ వార్షిక సువార్త కూడికలు ఘనముగా నిర్వహించిరి. స్థానిక సంఘస్థులు, పరిసర గ్రామస్థులు వారి సువార్తికులు కలసి ఉత్సాహముగా ఈ కూటములలో పాల్గొనగా మొదటిరోజున కె.జాన్‌మోజెస్ (కోరుకొండ) గారు గొప్ప దేవుడు అను అంశము పై గంభీరముగా బోధించిరి. "యెహోవా మనకు గొప్ప కార్యములు చేసియున్నాడను" వాక్యాధారముగా మూడుదినములు కూటములు జయకరముగ నడిచినవి.

రెండవరోజున జాషువాగూటం గారు గొప్పగ్రంధమును గూర్చి బోధించవలసియుండగా, సోదరి కబితా గూటం గారి తీవ్ర అనారోగ్యము వలన వారు హాజరుకాలేకపోగా పలువురు సువార్తికులు ఆయన స్థానమును భర్తీచేసిరి. హాజరైన వారందరు కబితాగారి అనారోగ్యమునుగూర్చి నిలబడి ప్రభువును ప్రార్థించగా ఆయన వారి ప్రార్ధనలను వినెను. మూడవ దినమున సోదరులు టి. జ్ఞానసుధీర్ గారు గొప్ప రక్షణను గూర్చిఅత్యంత ఆసక్తి జనకమైన వాక్యసందేశమునిచ్చిరి.

మూడుదినములు హాజరైన వారందరికీ స్థానిక సంఘము మంచిభోజనము నేర్పాటుచేసిరి. క్రీస్తు సంఘ సైనిక సహవాస సువార్తికులు ఆసక్తితో పాల్గొని కూటములను జయప్రదముగావించిరి. కూటములు ఇంత సమర్ధవంతముగా నడిపించిన సోదరులు పి. విజయకుమార్ గారును స్థానిక షువార్తికులు పి. ప్రేమ్‌సుధీర్ గారును అభినందనీయులు.

(మిగతా 23వ పేజీలో)

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 38 జూన్ - 2017 సంచిక -11

## ప్రేమతో కూడిన పరిచర్య
### (The Ministry of Love)

"యాకోబు రాహేలు కోసము ఏడు సంవత్సరములు కొలువు చేసెను. అయినను అతడు ఆమెను ప్రేమించుట వలన అవి అతనికి కొద్ది దినములుగా తోచెను" అని ఆది 29:20లో వ్రాయబడి యున్నది. యాకోబు చేసిన కొలువు ఒక వారము దినములు కాదు గాని ఏడు సంవత్సరములు. అయినను ఆ 2555 దినములును అతనికి కొద్ది దినములుగా తోచెను. అతడు కొలువు చేసినది తక్కువ కాలము కాదు. కాని రాహేలు యెడల తనకున్న ప్రేమవలన అతడు రాహేలు తండ్రియైన లాబానుకు పనిచేసిన ఏడు సంవత్సరములు బహుకొద్ది దినములుగా తోచెను. యాకోబు జీవితము నుండియు, అతడు తన మేనమామకు చేసిన ప్రేమపరిచర్య నుండియు మనము కొన్ని సంగతులు నేర్చుకొనవచ్చును.

**1. ప్రేమవలన దినములు సంకుచితము చేయబడును.** యాకోబు తమ మామయైన లాబానుకు ఏడు సంవత్సరములు సేవచేసినను, అతడు లాబాను కుమార్తెయైన రాహేలును ప్రేమించి నందున అవి అతనికి కొద్ది దినములుగా తోచెను. వందలకొలది సంవత్సరములు పాటు అబ్రాహాము గుడారములలో పాలస్తీనా దేశములో

జీవించెను గాని అతడు దేవునిచే నిర్మాణమైన ఒక పట్టణము కొరకు ఎదురు చూచెను. వాగ్దానము చేయబడిన దేశములో ఒక్క అడుగు కూడ అబ్రహాము పొందలేదు. అయినను అతడు శ్రేష్ఠమైన పరలోక రాజ్యము కొరకు ఎదురుచూచెను. తన కొరకును, తన పిల్లలకొరకును దేవుడొక నిత్యనివాసమును సిద్ధపరచెనని అతడెరుగును. అరణ్య మార్గముగుండా మోషేతో యెహోషువా చేసిన ప్రయాణము అతనికి దూర మనిపించలేదు. ఎందుకనగా పాలు తేనెలు ప్రవహించు దేశము కొరకు అతడు నిరీక్షించుచుండెను. దేవుని యందును, ఆయన పనియందును అతనికి కలిగిన ప్రేమవలన అదీర్ఘప్రయాణమతనికి బహు తేలిక యనిపించెను.

**2. ప్రేమ భారమును తేలిక చేయును :** మన బంధువులు గాని మిత్రులుగాని రోగపీడితులై యుండగా వారిని అనుకొని మన ముండుట వలన వారి భారము తేలిక యగును. అంతేకాదు దినముల తరబడి మనము పరిచర్యచేసినను అది మనకు భారమనిపించదు. ఎందువలన? మన పరిచర్య ప్రేమతో కూడిన దైనందువలన, శ్రమలలోను, బాధలలోను, రోగముతోను బాధపడువారికి పరిచర్య చేయువారు ప్రేమతో దానిని చేయవలెను. అప్పుడు వారి భారము తేలికయనిపించును. 'మీరు ఒకని భారముల నొకడు భరించి యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి" యని అపో.పౌలు గలతీ 6:2లో హెచ్చరించుచున్నాడు. థెస్సలోనీకయులకు వ్రాయుచు, విశ్వాసముతో కూడిన మీ పనిని, ప్రేమతో కూడిన మీ ప్రయాసమును మా ప్రార్థనలయందు జ్ఞాపకముంచు కొనుచున్నాము అని అపో.పౌలు వ్రాసెను (1థెస్స 1:2).

క్రైస్తవుని పరిచర్య ప్రేమతో కూడినట్టిది. క్రీస్తుకూడ పాపులను ప్రేమించు వారికి పరిచర్య చేయుటకు ఈ లోకమునకు వచ్చెను. ఆయన కుష్టరోగులను శుద్ధిచేసెను, గ్రుడ్డి వారికి నేత్రములిచ్చెను, చెవిటి వారికి చెవులిచ్చెను. బీదలనాదరించెను. రేయింబగళ్ళు మానవజాతికి ఉపకారము చేసెను. చివరకు

మానవుల పాపపరిహారార్థ బలిగా సిలువపై మరణించెను. ఆయనను హింసించి సిలువ వేసినవారిని కూడ యేసుక్రీస్తు ప్రేమించెను. తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు. గనుక వీరిని రక్షింపుము అని వారి కొరకు సిలువపై వ్రేలాడుచు ప్రార్థించెను. క్రీస్తు చేసిన ఈ గొప్పత్యాగము, భరించిన ఆ ఘోర సిలువ ప్రేమనుబట్టి చేసెను. ఆయన మనలను ప్రేమించెను గనుక మనమాయనను ప్రేమింప బద్ధులమై యున్నాము.

3. ప్రేమ వలన ఈ జీవిత ప్రయాణము సుఖమగును. ఈజీవిత యాత్రలోని రాజమార్గము లన్నియు సుఖశాంతులతో చేయబడలేదు. క్రీస్తు సువార్తను బోధించుచున్నందున జన సమూహము లొకసారి పౌలును రాళ్ళతో కొట్టిరి. అతడు చనిపోయెనను కొని వారతని విడిచివెళ్ళిరి. క్రీస్తు నందలి ప్రేమను బట్టి ఆ రాళ్ళను పౌలు భరించుకొనగల్గెను. ఫిలిప్పీ చెరసాలలో ఒక చీకటిగదిలో పౌలు పడవేయబడి నను అతని ఆత్మలో మాత్రము చీకటి లేదు. మధ్య రాత్రివేళ అతడును, సీలయు దేవునికి కీర్తనలు పాడుచుండిరి, ప్రార్థించుచుండిరి.

రోమా పట్టణమునకు పౌలు ప్రయాణము చేయు ఓడ తుఫానులో చిక్కుకొనెను. వారు సూర్యునిగాని, నక్షత్రములను గాని కొన్ని దినముల వరకు చూడలేకపోయిరి. ఆ ఓడలోని వారికి ప్రాణములతో తప్పించు కొందుమను ఆశ బొత్తిగా లేక పోయినను, క్రీస్తునందలి ప్రేమనుబట్టి, ధైర్యము తెచ్చుకొనుడి. నేను దేవుని నమ్ముచున్నాను. ఆయన నాతో చెప్పిన ప్రకారము జరుగునని పౌలు వారిని హెచ్చరించగలిగెను. దేవుని యందును క్రీస్తునందును ఉన్న విశ్వాస ప్రేమవలన పౌలుకు తుఫాను భయము పోయెను. ఒకవేళ మరణము సంభవించినను అది అతనికి లాభదాయకముగా అగుపడెను (ఫిలిప్పీ 1:21). అందువలన, "నా సహోదరులారా మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి మీరు నానావిధములైన శోధనలలో పడునప్పుడు అది మహానందమని యెంచుకొనుడి" యని యాకోబు హెచ్చరించు చున్నాడు (యాకోబు 1:2).

4. ప్రేమ వలన యితరుల భారములను మోయుటయే గాక మన సిలువను మనమే మోసికొనగలము. “వారు యేసును తీసికొనిపోయిరి. ఆయన తన సిలువను మోసికొని కపాల స్థలమను చోటికి వెళ్ళెను, హెబ్రీ భాషలో దానికి గొల్గతా అనిపేరు” అని యోహాను 19:17లో వ్రాయబడి యున్నది.

యేసు ఈ బరువైన సిలువను మోయనక్కరలేదు. అవుసరమయితే తనకు సహాయము చేయు నిమిత్తము పండ్రెండు దళముల దూతలను పిలువ గలడాయన. అయినను యేసుక్రీస్తు నిన్ను, నన్ను ప్రేమించినందువలన ఆ సిలువను ఆయన మోసెను. ఆ సిలువను మోయటద్వారా ఆయన మనకు మోక్షమార్గమును తెరచెను. గనుక ఈనాడు ఎవడును సిలువ అప జయమునకు గుర్తని అనుకొనడు. సమాధితోనే సమస్తమును అంతమై పోయినదని ఎవడును తలంచడు. గొప్ప ప్రేమను బట్టి యేసు భార భరితమైన సిలువను మనకొరకు మోసెను. సిలువ నుండి ఆయన సింహాసనము నధిష్ఠించెను. అవును సిలువ మార్గమే రక్షణ మార్గము.

ఎవడైనను నన్ను వెంబడింప గోరిన యెడల తన్ను తాను ఉపేక్షించు కొని తన సిలువ నెత్తికొని నన్ను వెంబడింపవలెను అని యేసు బోధించెను (మత్తయి 16:24). క్రైస్తవుని జీవితము ఈ లోకములో సులభమైనదికాదు. అందువలన క్రీస్తును వెంబడింప గోరువాడు అన్ని విధములైన శోధనలను, బాధలను, శ్రమలను భరించుటకు సంసిద్ధుడై యుండవలెను. క్రైస్తవుడు తన యొక్కయు, యితరుల యొక్కయు భారములను ప్రేమతో భరించును. తన సొంత సిలువను క్రీస్తునందలి ప్రేమతో సంతోషముగా భరించును. యిట్లు చేయుటలో పరలోకానికి చేరు కొనుటయే అతని ముఖ్యోద్దేశము.

నీవు క్రీస్తును వెంబడింప గోరుచున్న యెడల ఆయన సువార్తను వినుము. క్రీస్తుదేవుని కుమారుడని నమ్ముకొనుము. నీ పాపములను గూర్చి మారుమనస్సు పొందుము. క్రీస్తునామమున నీటిలో ముంచడము బొంది నీ పాపములను కడుగు కొనుము. ప్రేమ సంతోషములతో క్రీస్తు పరిచర్య చేయుము. మోక్షాన్ని సాధించుము!!

# సంఘపెద్దలలో పురుష నాయకత్వము

## (Male Leadership in the Elders)

మొట్టమొదటి క్రీస్తుసంఘము యెరూషలేములో యుండెను. మొదట్లో క్రీస్తుయొక్క అపొస్తులులు దానిని నడిపించిరి; గాని ఒకానొక సమయమున దానిలో పెద్దలు ఏర్పరచ బడిరి (అపో.కా 11:30; 15:2; 16:4). యెరూషలేము నుండి ప్రపంచ మంతటా క్రైస్తవ్యము వ్యాపించెను (అపో.కా.1:8; మార్కు 16:15, కొలస్స 1:23). ప్రపంచమంతటా క్రైస్తవ్యము వ్యాపించుటలో సువార్త చాటించుటకు పెద్దలు ఒక భాగమై యున్నారు.

సంఘము కొరకు దేవుని ఏర్పాటులో పెద్దలు ఒక భాగమై యున్నారు. యెరూషలేములోని సంఘములో పెద్దలుండిరి (అపో.కా. 15:46). పౌలుచేసిన సువార్త దండయాత్రలో ప్రతి స్థానిక సంఘము లోను పెద్దలను నియమించెను (అపో.కా.14:23). ఎఫెసులో సంఘములో పెద్దలుండిరి (అపో.కా. 20:17). కొన్నిసార్లు మాదిరి సంఘమని పిలువబడిన ఫిలిప్పయిలో కూడ పెద్దలుండిరి (ఫిలిప్పీ 1:1). ప్రతి పట్టణములోను పెద్దలను నియమించు నిమిత్తము పౌలే తీతును క్రేతులో విడిచి పెట్టెను (తీతు 1:5). "మీలోని పెద్దలను" గూర్చి పేతురు హెచ్చరించాడు (1పేతురు 5:1). పరిశుద్ధాత్మవలన అనుగ్రహించబడిన అర్హతలను కలిగిన పురుషులు స్థానిక సంఘములో పరిశుద్ధాత్మ సహాయము వలన స్థానిక సంఘము ద్వారా పెద్దలుగా నియమింపబడిరి. "పరిశు ద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో" యని పౌలు పెద్దలను హెచ్చరించాడు (అపో.కా. 20:28).

ప్రతి స్థానిక సంఘములోను పెద్దలు నియమింపబడాలనునది బైబిలు యొక్క ప్రాముఖ్యబోధయై యున్నది. ఈ గొప్ప పనికొరకు సరియైన వ్యక్తులను ఎంపిక చేసుకొన వలెను. అందువలన ఈ ఆత్మీయ స్థానమును నింపుటకు అవసరమైన వారికి పరిశుద్ధాత్మద్వారా పౌలు కొన్ని అర్హతలను నియమించాడు. ప్రతి

స్థానిక సంఘము దానిని ఆత్మీయముగా నడిపించుటకు తగిన పురుషులను నియమించుకొనవలెను. ఈ విషయంలో వారు కడుజాగ్రత్త వహించవలెన. పెద్దలుగా నియమింపబడిన ఈ పురుషులు స్థానిక క్రీస్తు సంఘమును గొప్ప దైవసేవలో నడిపించ వచ్చును లేదా దానిని నులివెచ్చని స్థితికి దిగజార్చవచ్చును. అదంతా వారి నాయకత్వము పై ఆధారపడియున్నది.

సంఘం పెద్దలను గూర్చి అపొ.కా. 11:30లో మొదటిగా చెప్పబడెను. అభివృద్ధిచెందిన ప్రతి స్థానిక సంఘము పెద్దలచే పాలింపబడును. వారికున్న బైబిలు అర్హతలను బట్టి వారు పెద్దలుగా ఏర్పాటు చేయబడిన వారు (1తిమోతి 3:1-7; తీతు 1:5-9). అయితే పెద్దలు లేని సంఘము ఎట్లు నడిపించబడవలెను? బోధకుడే సంఘమును నడిపించ బాధ్యుడా? లేదా సంఘ నడిపింపు కొరకు పురుషులను ఒక కమిటీగా బైబిలు ప్రకారము ఏర్పాటు చేసికొనవచ్చునా? లేక కొందరు ట్రస్టీలు సంఘమును పాలించవచ్చునా? కోశాధికారి సంఘ నిర్ణయములను గైకొను అధికారము కలిగియున్నాడా? సంఘములో స్త్రీ పురుషులందరు ఓటువేసి ఆయా కార్యకలాపములను సాగించవచ్చునా? ఆత్మీయముగా పెద్దలు లేని సంఘమును నడిపించు బాధ్యత ఎవరిది?

పెద్దలు లేకుండా స్థానిక సంఘము నిలబడగలదా? అవును మొదటి శతాబ్దములో పెద్దలు లేకుండగానే సంఘములు కొంతకాలము పనిచేసినట్లు గ్రహించగలము (తీతు 1:5). అయితే తదుపరి ఈ సంఘములు అభివృద్ధి జెంది పెద్దలను ఏర్పాటు చేసికొనిరి. గనుక పెద్దలు లేని సంఘము నడిపించబడుట ఎట్లు? అనే ప్రశ్న ఇంకా అలాగేయున్నది.

**ఇంకను పెద్దలు లేరు :**

పెద్దలు లేనప్పుడు స్థానిక సంఘము సువార్తికుల పర్యవేక్షణలో నడిపించ బడడం సంఘపాలనకు పరిష్కారము కాదు. ప్రతి స్థానిక సంఘము (బహుమంది) పెద్దలచే నడిపించబడునట్లు దేవుడు సంకల్పించారు. దీనిని బట్టి ఒక వ్యక్తి ఎంత గుణవంతుడైనను, మాదిరి

జీవితమును కలిగియున్నను అతడొక్కడే ఈ పనికి తగినవాడు కాదు, స్థానిక సువార్తికుడు సంఘ యజమాని కాదు. దైనందిన సంఘపరమైన నిర్ణయము లను అతడొక్కడే గైకొనునట్లు నడిపించ బడకూడదు. సరిగదా ఆ సువార్తికుడు స్థానిక సంఘము ఆత్మీయముగా పరిపక్వతజెందునట్లు దానిని నడిపించ వలెను. సువార్తికుడు సంఘములోని పురుషులు వివిధ బాధ్యతలు స్వీకరించు నట్లు వారికి తర్బీతునీయవలెను. తాను లేకపోయినను సంఘము యొక్క పని సక్రమముగా నడిపించబడగల్గునట్లు అందరి పురుషులకు శిక్షణ ఇయ్యవలెను.

సంఘపెద్దల స్థానములో ఒక కమిటీద్వారా పనులు జరిగించబడుట సంఘపాలనకు తగినది కాదు. సంఘ పాలన బాధ్యతలను దేవుడు పెద్దలకు అప్పగించారు, ఒక కమిటీకి కాదు.

తదుపరి స్థానిక సంఘ ఖజనాదారుడు తన పరిచర్య భారమును పలుకుబడి కోసము, అధికారము కోసము వినియోగించ రాదు. కొన్ని సందర్భాలలో పెద్దలలో ఒకడు ఖజానాదారుడు కావచ్చును. అయితే అతడు పెద్దలలో ఒకడు మాత్రమే. ప్రత్యేకాధికారి యేమీకాదు. ఖజానాదారుడు గనుక సంఘమును అతడు కంట్రోలు చేయువాడైతే అది పాపభూయిష్టము (3యోహాను:9,10).

స్త్రీ పురుషులు కలిసి ఓటువేసే పద్ధతి యేమైనాయుంటే అది ఆత్మీయ విషయాల్లో స్త్రీ పురుషుల పాత్రను భంగపరచునట్టిదై యుండును (1తిమో 2:12-14). గృహములో ఎట్లో (ఎఫెసీ 5:22-24; ఆది.కా.3:16) సంఘములోను అట్లే (1కొరింథి 11: 8-9). స్త్రీ పురుషునికి లోబడి యుండవలెనని బైబిలు బోధించు చున్నది. పెద్దలు లేనప్పుడు యుక్త వయస్సుగల పురుషులు సంఘ కార్య కలాపములను గూర్చిన బాధ్యత కలిగి యుందురు.

**పెద్దల యొక్క అవశ్యకత :**

కొన్నిసార్లు స్థానిక సంఘములో ఇద్దరు లేక ముగ్గురు అర్హతగల పురుషులు లేనందున పెద్దలు ఉండక పోవచ్చును. 1తిమోతి 3:1-7లోను, తీతు 1:5-9లోను ఇయ్యబడిన అర్హత గల క్రైస్తవపురుషులు అట్టి అర్హతలేని

క్రైస్తవ పురుషులను వేరుచేయును. అయితే అర్హత గల పురుషులున్న యెడల స్థానిక సంఘము వారిని పెద్దలుగా నియమించు బాధ్యత కలిగియున్నది.

తీతు 1:5లో పౌలు చెప్పినది గమనించుము : "నేను నీకాజ్ఞాపించిన ప్రకారము నీవు లోపముగా ఉన్న వాటిని దిద్ది ప్రతిపట్టణములోను పెద్దలను నియమించు నిమిత్తమే నేను క్రేతులో నిన్ను విడిచివచ్చితిని". స్థానిక సంఘములో పెద్దలు లేకపోవుట ఒక లోపముగా పరిశుద్ధాత్ముడు మనకు వర్ణించుచున్నారు.

లోపము అనగా చేయబడ కుండా విడిచి పెట్టబడినది. ఇంకా చేయవలసి యున్నది యను భావము నిచ్చుచున్నది. గనుక పెద్దలను ఏర్పాటు చేయడం మన యిష్టా యిష్టముల మీద లేదు గాని అది దేవుని ఆజ్ఞ. అందువలన అర్హతగల పురుషులున్న ప్రతి స్థానిక సంఘము పెద్దలను ఏర్పాటుచేయవలెను. అపో.పౌలు తాను స్థాపించిన ప్రతి సంఘములోను పెద్దలను ఏర్పాటు చేయడం మనం గమనిస్తాము : "మరియు ప్రతి సంఘములో వారికి పెద్దలను ఏర్పరచి ఉపవాసముండి, ప్రార్థన చేసి వారు నమ్మిన ప్రభువునకు వారిని అప్పగించిరి" (అపో.కా. 14:23).

పరిపక్వత జెందిన ప్రతి స్థానిక సంఘము అర్హతలు గలిగిన పెద్దల పర్యవేక్షణ క్రింద పనిచేయును (అపో.కా. 20:28). పెద్దలు లేని ఏ స్థానిక సంఘమైనా పరిపక్వత జెందినది కాదు. పెద్దలకుండవలసిన బైబిలు అర్హతలను చులకనగా చూడరాదు. గాని వాటిని కఠినంగా అమలు చేయనుద్దేశ్యముతో ఏ మానవుడు చివరకు పెద్దగా యుండకుండా చేయరాదు. స్థానిక సంఘము లోని ప్రతి ఆత్మకు బాధ్యులుగా ఆ సంఘములోని పెద్దలను దేవుడు పరిగణించును (హెబ్రీ 13:17). యేసు క్రీస్తు ప్రధాన కాపరియై యుండగా స్థానిక సంఘ కావరులు (పెద్దలు) పరిచర్య చేయుదురు (1 పేతురు 5:1-4). యిది దైవిక చట్టము, స్థానిక సంఘ క్షేమము నిమిత్తము అనుచరణీయము.

- లూయిస్ రష్మోర్

# నోవహు దినములు ఏలాగుండెనో

## (As the Days of Noah Were...)

యేసు దేవాలయము నుండి బయలుదేరి వెళ్లుచుండగా ఆయన శిష్యులాయన యొద్దకు వచ్చి - దేవాలయపు వినాశనము ఎప్పుడు జరుగును? మరియు నీ రాకడకును ఈ యుగసమాప్తికి సూచనలేవి? అని రెండు ప్రశ్నలు అడిగిరి. మొదటి ప్రశ్నకు సమాధానం మత్తయి 24: 1-26 నందు వ్రాయబడియున్నది. మరియు రెండవ ప్రశ్నకు సమాధానం 27 నుండి 50 వచనముల యందు చదవగలము. “అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే (యెరుగును) గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు. నోవహు దినములు ఏలాగుండెనో మనుష్యకుమారుని రాకడయును అలాగే ఉండును. “జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినము వరకు, వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచు నుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొనిపోవు వరకు ఎరుగక పోయిరి; అలాగుననే మనుష్య కుమారుని రాకడయు ఉండును” (మత్తయి 24:36-39). ఇక్కడ యేసు ఆయన యొక్క రెండవ రాకడను నోవహు సమయములో జలప్రళయము ముందు రోజులతో పోల్చెను.

నరులు భూమి మీద విస్తరింప నారంభించిన తరువాత వారి చెడుతనము భూమి మీద గొప్పదని దేవుడు చూచి నరులను చేసినందుకు సంతాపము నొంది జలప్రళయము ద్వారా భూమిని నాశనము చేయాలని నిర్ణయించుకొనెను. అయితే నీతి పరుడైన నోవహు యెహోవా దృష్టి యందు కృపపొందిన వాడాయెను. దేవుడు నోవహును చితిసారకపు మ్రానుతో ఓడను చేసి అరలు పెట్ట వలెనని ఆజ్ఞాపించెను. నోవహును అతని భార్యయు, అతని కుమారులును కోడండ్రును సమస్త జీవులలో ప్రతి జాతిలోను రెండేసి చొప్పున ఓడలోనికి

ప్రవేశించి నలుబది పగళ్లును, నలుబది రాత్రులును కురిసిన ప్రచండ వర్షము నుండి రక్షింపబడెను. అప్పటి దినము వరకు భూమి మీద వర్షము పడలేదు. అయినా నోవహు దేవుడు ఆజ్ఞాపించిన ప్రకారము యావత్తును చేసెను. "విశ్వాసమును బట్టి నోవహు అదివరకు చూడని సంగతులను గూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై తన యింటి వారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. అందువలన అతడు లోకము మీద నేరస్థాపన చేసి విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసుడాయెను" (హెబ్రీ 11:7). మరియు ఆయన పూర్వకాల మందున్న లోకమును విడిచిపెట్టక, భక్తిహీనుల సమూహము మీదికి జలప్రళయమును రప్పించినప్పుడు, నీతిని ప్రకటించిన నోవహును మరి యేడుగురిని కాపాడెను (2పేతురు 2:5). మనము జలప్రళయము ముందటి తరమును రెండు వర్గాలుగా విభజించ గలము... నోవహు అతని భార్యయు అతని కుమారులు, అతని కోడండ్రును ఓడలోనికి ప్రవేశించి రక్షింపబడెను. వీరు మొదటి వర్గము. మరియు రెండవ వర్గమునకు చెందిన ప్రజలు ఓడ వెలుపల ఉన్నవారు తినుచు త్రాగుచు, పెండ్లిచేసికొనుచు, పెండ్లికిచ్చుచు నుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొనిపోవువరకు ఎరుగకపోయిరి (మత్తయి 24:38,39).

ఇప్పుడు మనము యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడకు ముందు రోజులలో జీవించుచున్నాము. మనము ఈ తరములోను రెండు వర్గాల ప్రజలను చూడగలము. ఎవరైతే సువార్త విని దానికి విధేయులై ఉన్నారో వారు సురక్షితముగా నోవహు యొక్క కుటుంబము ఓడలో రక్షింపబడినట్లు సంఘముతో చేర్చబడి రక్షింపబడి యున్నారు. ఎవరైతే దేవునికి మరియు దేవుని యొక్క వాక్యమునకు దూరముగా ఉన్నారో వారు రెండవ వర్గమునకు చెందినవారు.

"ఏలయనగా పూర్వము నుండి ఆకాశముండెననియు, నీళ్లలోనుండియు నీళ్లవలనను సమకూర్చబడిన భూమియు దేవుని వాక్యము వలన కలిగెననియు వారు బుద్ధిపూర్వకముగా మరతురు. ఆ నీళ్లవలన అప్పుడున్న

లోకము నీటి వరదలో మునిగి నశించెను. అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగు దినము వరకు అగ్నికొరకు నిలువచేయబడినవై అదే వాక్యము వలన భద్రము చేయబడి యున్నవి"(2పేతురు 3:5-7). అయితే ఆ దినమును గూర్చియు, ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను పరలోక మందలి దూతలైనను కుమారుడైనను యెరుగరు (మత్తయి 24:36). మీ హృదయములు ఒకవేళ తిండి వలనను మత్తువలనను ఐహిక విచారముల వలనను మందముగా ఉన్నందున ఆ దినము అకస్మాత్తుగా మీ మీదకి ఉరి వచ్చినట్టు రాకుండ మీ విషయమై మీరు జాగ్రత్తగా ఉండుడి. ఆ దినము భూమి యందంతట నివసించు వారందరి మీదకి అకస్మాత్తుగా వచ్చును. కాబట్టి మీరు జరగబోవు వాటినెల్లను తప్పించుకొని, మనుష్య కుమారుని యెదుట నిలువబడుటకు శక్తిగల వారగునట్లు ఎల్లప్పుడును ప్రార్థన చేయుచు మెలకువగా ఉండుడని యేసు చెప్పెను (లూకా 21:43-36). అపోస్తులుడైన పౌలు థెస్సలోనికయుల సంఘమునకు ఈ విధముగా వ్రాసెను. "లోకులు నెమ్మదిగా ఉన్నది, భయమేమియు లేదని చెప్పుకొనుచుండగా, గర్భిణి స్త్రీకి ప్రసవవేదన వచ్చునట్లు వారికి ఆకస్మికముగా నాశనము తటస్థించును గనుక వారెంతమాత్రము తప్పించు కొనలేరు (1థెస్సలోనికయులు 5:3).

జలప్రళయము ముందటి తరము వారు నోవహు బోధయందు నమ్మికయుంచలేదు, దానిని లక్ష్యపెట్ట లేదు. నోవహును నిర్లక్ష్యము చేసి ఎగతాళి చేసిరి. వారు తినుచు త్రాగుచు పెండ్లిచేసికొనుచు, పెండ్లి కిచ్చుటలో నిమగ్నమైరి. మనము ఇప్పుడు యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడ ముందటి సమయములో జీవించుచున్నాము గనుక, రెండవ వర్గపు ప్రజలు వలె నశింపబడకుండ ఉండునట్లు మెలకువగా ఉండి దేవుని కలిసికొనుటకు మనల్ని మనము సిద్ధ పరచుకొందము...

– కవితా గూటం

# కీర్తన 19 : 1-3

## ( Psalms 19 : 1-3 )

" ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి.
అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచు చున్నది.
పగటికి పగలు బోధ చేయు చున్నది.
రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపు చున్నది.
వాటికి భాషలేదు, మాటలు లేవు వాటి స్వరము వినబడదు".

భూమి తన యిరుసుపై గంటకు వెయ్యిమైళ్ల వేగముతో తిరుగు చున్నది. అది గనుక 100 మైళ్ళ వేగమే అయితే, మన రాత్రులు, పగళ్లు పదిరెట్లు దీర్ఘకాలమై యుండును. మరియు ఈ భూగోళము చివరకు ఘనీభవించును లేదా కాలిపోవును. అట్టి పరిస్థితులలో వృక్ష సంపద యావత్తు నశించును.

భూమి చంద్రుని వలె చిన్నదై యుంటే మానవ నివాసమున కవసరమైన భూమ్యాకర్షణ శక్తి బహు స్వల్పమై యుండును. లేదా భూమి వరుణుడు, శని గ్రహాలవలె విస్తీర్ణములో పెద్దదై యుంటే భూమ్యాకర్షణ శక్తి విపరీతమై మానవ నివాసయోగ్యము కానిదై యుండును.

శుక్ర (వీనస్) గ్రహము వలె భూమి సూర్యునికి దగ్గరగా యుంటే సహింప జాలనంత ఉష్ణోగ్రతకు పాలగుదుము. లేదా అంగారక గ్రహమంత దూరముగా యుంటే భూమి అంతయు శీతలమై నివాస యోగ్యము కానిదగును.

ఇప్పుడున్న మహాసముద్రములు వాటి విస్తీర్ణములో నాలుగవ వంతు మాత్రమే యుంటే ఇప్పుడున్న వర్షపాతములో నాలుగవ వంతు మాత్రమే భూమి పై సంభవించును. లేదా సముద్రములు ఇంకొంచెము పెద్దవై యుంటే భూమి అంతయు నీట మునిగిన గొయ్యివలెనగును. నివాస యోగ్యము కానిదగును.

నీరు $32^0$F (0 డిగ్రీల) వద్ద ఘనీభవించును. అయితే ఈ చట్టము మహాసముద్రములకు వర్తిస్తే గొప్ప ప్రమాదము సంభవించును. అయినా ధృవప్రాంతములన్నీ ఘనీభవించిన నీరుతోనే యున్నవి. మహాసముద్రములన్నీ ఐస్ వలె గడ్డకట్టకుండా దేవుడు వాటిలో ఉప్పు ఉంచియున్నారు.

"మీరు సత్యమును గ్రహించెదరు, సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని" యేసు చెప్పారు (యోహాను 8:32)

# బైబిలును నమ్ముటకు కారణములు

## ( Reasons to Believe the Bible )

బైబిలు దైవావేశము వలన కలిగినదని చెప్పుకొనుచున్నది. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును తప్పుదిద్దుటకును నీతియందు శిక్షణ చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2తిమో 3:16,17). దైవావేశము అనుమాటకు థియోనూస్టాస్ అను గ్రీకు పదమును పౌలు వినియోగించాడు. అనగా దేవుని ఊపిరి వలన కలిగిన మాటలని యర్థము.

**దైవావేశము**

దైవావేశాన్ని పేతురు ఇట్లు వివరించాడు. "ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2పేతురు 1:21). దేవుడేమైనా చెప్పగా, మానవుడు దానిని లిఖించాడు. ప్రవక్తల కాలములో దైవావేశము ఇట్లు పనిచేసినది (హెబ్రీ 1:5, 8; 5:5,6).

పాత నిబంధన లేఖకులు, క్రొత్త నిబంధన లేఖకులు కూడ దైవావేశము వలన వ్రాసినట్లు చెప్పుకొన్నారు. యెషయా 1:1,2,10,24; యిర్మియా 1:1,2 ; 2:1; యెహెజ్కేలు 1:1-3; 1 థెస్స 2:13; 2పేతురు 3:2). పాత నిబంధన లేఖనములు దైవావేశములని యేసు గమనించారు, అవి అధికార పూరితమైనవని ఆయన గుర్తించారు (మత్తయి 4:4,7,10). పాత నిబంధన ప్రవచనములను నెరవేరుస్తు దేవుని చిత్తమును జరిగించుటకే ఆయన ఈ లోకమునకు వచ్చెను (మత్తయి 5:7-18; యోహాను 15:25). పాత నిబంధన లేఖకులు దైవావేశము కలిగిన వారని క్రొత్త నిబంధన లేఖకులు గుర్తించారు (అపో.కా. 1:15, 16; 4:25, 28:25-27, గలతీ 3:16-19).

క్రొత్త నిబంధన లేఖకులు కూడా తాము దైవావేశముచే వ్రాయుచున్నట్లు చెప్పుకొన్నారు. అపొస్తులులు పరిశుద్ధాత్మవలన నడిపించబడుదురని యేసుచెప్పారు (యోహాను 14:25,26; 16:12,13; హెబ్రీ 2:1-4). పౌలు

యొక్క వ్రాతలను గూర్చి పేతురు సవిస్తరముగా ఇట్లు చెప్పాడు : "మరియు మన ప్రభువు యొక్క దీర్ఘ శాంతము రక్షణార్థమైనదని యెంచు కొనుడి. అలాగు మన ప్రియ సహోదరుడైన పౌలు కూడ తనకు అనుగ్రహించబడిన జ్ఞానము చొప్పున మీకు వ్రాసియున్నాడు. వీటిని గూర్చి తన పత్రికలన్నిటిలోను బోధించు చున్నాడు. అయితే వాటిలో కొన్ని సంగతులు గ్రహించుకొనుటకు కష్టమైనవి. వీటిని విద్యాహీనులును, అస్థిరులైన వారును తక్కిన లేఖనములను అపార్థము చేసినట్లు తమ స్వకీయ నాశనమునకు అపార్థము చేయుదురు" (2పేతురు 3:15,16).

**వైజ్ఞానికంగా యదార్థము :**

అయితే ఇట్టి అంతరంగ ఆరోపణలు రుజువుకాకపోతే అవి నిష్ప్రయోజనము. గనుక వాటి యదార్థతను మనం పరీక్షించాలి. బైబిలు దేవుని నుండి కలిగినదని మనము తెలిసికొనగలము ఏలయనగా మానవునికెరుక లేని అనేక వైజ్ఞానిక సంగతులు దానిలో వ్రాయబడి యున్నాయి. ఆదికాండము 1:11,12, 21,24,25 వచనాలలో వాటి వాటి జాతి ప్రకారము అనేమాటలు మనకు కనబడ్డాయి. యివి గడ్డి, చెట్లు, చేపలు, పక్షులు, జంతువులు మొ॥గు వాటిని గూర్చి చెప్పబడిన మాటలు. ఇవన్నీ వాటికవే కలిగినవని గాక వాటి వాటి జాతి ప్రకారము వ్యాప్తిజెందునట్లు సృజింపబడెను.

ఎనిమిది దినముల వయస్సు గల శిశువు రక్తములో గాయములను మాన్పు కణములుద్భవించునని ఆధునికంగా వైద్యులు కనుగొన్నారు. గాని కొన్నివేల సంవత్సరముల క్రితమే మగశిశువులు ఎనిమిదవ దినమున సున్నతి చేయబడవలెనని మోషే బైబిలు నందు వ్రాసాడు (లేవీ 12:3). అంటు వ్యాధులు కలవారిని ఎడముగా యుంచాలని ఆధునిక వైద్యులు తెలిసి కొనకముందు నుండే, బైబిలు లేవీ 13:46లో కుష్టురోగులు ఎడముగా యుండాలని హెచ్చరించింది: "ఆ పొడ వానికి కలిగిన దినములన్నియు వాడు అపవిత్రుడై యుండును, వాడు అపవిత్రుడు గనుక ప్రత్యేకముగా నివసింపవలెను". వాని నివాసము పాళెమునకు వెలుపల యుండవలెను. "మరియు ఆపొడ గల కుష్టరోగి వస్త్రములను చింపివేయవలెను; వాడు తల విరియ బోసుకొనవలెను, వాడు

తన పై పెదవి కప్పుకొని అపవిత్రుడను, అపవిత్రుడను అని బిగ్గరగా పలుకవలెను" (లేవీ 13:45).

పూర్వమందు అమెరికా అధ్యక్షుడగు జార్జివాషింగ్టన్ కాలములో రక్తము కారిపోతే రోగం పోయేదని తలంచారు, గాని ఇప్పుడైతే రక్తమే ప్రాణమని వైద్యులు అంగీకరిస్తారు. దీనిని మోషే బైబిలులో ఎప్పుడో వ్రాసాడు (ఆది.కా. 9:4; లేవీ 17:11,14).

నదులన్నియు తమ నీటిని సముద్రములో పడవేయుచున్నట్లు అగుపడుచున్నను, ఈ భూమి ఎందుకు నిండిపోవుటలేదు? అని మనం అడుగ వచ్చును. సొలొమోను ద్వారా దేవుడు దానికి జవాబిచ్చారు. "నదులన్నియు సముద్రములో పడును; అయితే సముద్రము నిండుటలేదు; నదులు ఎక్కడనుండి పారివచ్చునో అక్కడికే అవి ఎప్పుడు మరలిపోవును. ఎడ తెరపి లేకుండ సమస్తము జరుగుచున్నది. మనుష్యులు దానిని వివరింపజాలరు" (ప్రసంగి 1:7,8). ''మేఘములు వర్షముతో నిండియుండగా అవి భూమి మీద దాని పోయును'' (ప్రసంగి 11:3). "సముద్రములను పిలిచి వాటిని భూమి మీద ప్రవహింపజేయు వాడు ఆయనే" యని ఆమోసు కూడ సొలొమోనుతో ఏకీభవించుచున్నాడు (ఆమోసు 9:6).

బైబిలులో అద్భుతములు చేసిన వారు, దేవుని దరుపున చేయుచున్నామని చెప్పుకొనిరి. మోషేదేవుని శక్తి వలన చేయుచున్నట్లు ఇశ్రాయేలీయులు గ్రహించుకొనునట్లు ఆయన మోషేకు సూచకక్రియలు చేసే శక్తినను గ్రహించెను (నిర్గమ 4:1-5). ఐగుప్తు దేశము మీద ఆయన మోషే ద్వారా కలుగుజేసిన పది తెగుళ్లను, పరమందొక దేవుడున్నాడని, మోషే ఆయన సేవకుడని గుర్తింపుపొందు నట్లు వాటిని కలుగజేసెను (నిర్గమ 7:5,17; 8:10,22; 9:14,29; 10:2; 11:7; 13:3; 14:14). యేసు దేవుని కుమారుడని నిరూపించుట కొరకు ఆయన మృతులలో నుండి లేపబడెను (రోమా 1:4). అపొస్తులులు చేసిన అద్భుత కార్యముల ద్వారా వారు చెప్పేది దేవుని వాక్యమేయని నిర్ధారించ బడెను (మార్కు 16:14-20; హెబ్రీ 2:3,4).

**భౌగోళికంగా బైబిలు యదార్థము :**

బైబిలు భౌగోళికంగా యదార్థము. బైబిలు చెప్పు ప్రదేశములు, స్థలములు, పట్టణములు యదార్థము. యేసు ఒక

ఉపమానము చెప్పెను. "ఒక మనుష్యుడు యెరూషలేము నుండి యెరికోపట్టణమునకు దిగివెళ్లుచు దొంగల చేతిలో చిక్కెను; వారు అతని బట్టలు దోచుకొని అతని కొట్టి కొనప్రాణముతో విడిచిపోయిరి" (లూకా 10:30). యెరూషలేము కొండప్రాంతము, అక్కడ ఒలీవకొండ 2680 అడుగులు ఎత్తు గలది. యెరికో అయితే మృతసముద్రము ముఖద్వారమున యుండెను. గనుక ఒకడు యెరూషలేము నుండి యెరికో పోవాలంటే దిగి వెళ్ళవలసినదే.

బైబిలు యదార్థతను నిరూపించుట కొరకు మిగతా కొన్ని సంగతులు కూడ చెప్పుకొనవచ్చును. అది చారిత్రాత్మకంగా వాస్తవము. దానిలోని 66 పుస్తకములు 1600 సంవత్సరముల కాలములో వ్రాయ బడినను, 40 మంది లేఖకులు అందు కొరకు వినియోగింపబడినను, దానిలో గొప్ప ఐక్యత ఉన్నది. దాని వర్తమానము గొప్పది. గనుక బైబిలు యదార్థము. నిజంగా అది దేవుని ఊపిరి వలన కలిగిన గ్రంథము.

– గేరీ హేంప్టన్

## వివాదస్పద క్రీస్తు

### ( The Controversial Christ )

యేసుప్రభువు యొక్క తిరుగులేని అధికారము వలన కొన్ని కుటుంబములలో ఖడ్గము సంభవించెను (మత్తయి 10:32). కుటుంబములో క్రీస్తు ప్రవేశించిన తరువాత, మానవులు ఆయనను గూర్చి ఎక్కువ పరిగణించవలయును. నజరేతువాడైన ఈయనను గూర్చి ఎవడును తటస్థముగా యుండలేడు. "నాపక్షమున నుండని వాడు నాకు విరోధి, నాతో కలిసి సమకూర్చని వాడు చెదరగొట్టువాడని" ఆయన చెప్పెను (మత్తయి 12:30).

మన రక్షకుడైన యేసు ఎందువలన అంత వివాదస్పదు డయ్యారు? రోమా సామ్రాజ్యములో అనేకులకు ఆయన అడ్డురాయిగాను, అడ్డుబండగాను అగుపడెను (రోమా 9:33). ఎందువలన? ఆయన "మనుష్యుల వలన విసర్జింపబడిన వాడును, వ్యసనాక్రాంతుడు గాను" ఉండెను (యెషయా 53:3). గదరేనీయులు తమ ఆత్మల కంటె పందులను గూర్చి ఎక్కువ లక్ష్యపెట్టారు

గనుక వారాయనను విసర్జించారు (మార్కు 5). పరిసయ్యుల యొక్క పారంపర్యాచారములనాయన ఖండించారు గనుక వారాయనను ద్వేషించారు (మార్కు 15:7-12). ఆయనను గూర్చి "ప్రజలలో కూడ భేదములు పుట్టెను" (యోహాను 7:43).

**ఆయన పరిపూర్ణత యితరులను ఇబ్బంది పెట్టెను :**

దేవుని కుమారుని సమక్షమున ఇంకొకని ప్రఖ్యాతి వెలవెలబోయేది. ఆయన సంభాషణ క్రియలు, స్వభావము మొ॥నవి మనోహరంగా సాటిలేనివి. యేసు లేఖనములను వివరించునప్పుడు శాస్త్రులు ఎందుకు పనికిరాని వారయ్యారు. మెస్సీయ యొక్క పవిత్రతలో పరిసయ్యుల యొక్క నటన అంతా పటాపంచలైయ్యింది. సద్దూకయ్యుల అహంభావ ఆరోపణ లన్నియును రక్షకుని ఒక్కమాటలో తునాతనకలయ్యేవి (మత్తయి 22:23-33). అందువలన యేసు ద్వేషింపబడ్డారు. రోమా గవర్నరయిన పొంతిపిలాతు కూడ, "యూదులు అసూయచేత యేసును అప్పగించారని" తెలుసుకొన్నాడు (మార్కు 15:10).

**ఆయన రక్షణ ఆత్మీయము :**

యేసు పాలస్తీన భూభాగము మీద అడుగు పెట్టేసరికి యూదుల మధ్య హోసన్నయనే విమోచన పదము ప్రఖ్యాతి గాంచియుండెను. మక్కబీయుల కాలము నుండి అది భౌతిక విడుదలను గూర్చిన పదమై యుండెను. హోసన్న యనగా "మమ్ములను రక్షించుమని ప్రార్థించు చున్నామని" యర్థము. యేసు విజయోత్సహముతో యెరూషలేములో ప్రవేశించినప్పుడు ప్రజలు "జయము (హోసన్న), ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడును గాక" యని కేకలు వేయుచుండిరి (మార్కు 11:9,10). ఆరోజు దారిపొడువునా ప్రజలు ఆకులు కొమ్మలు బట్టలు పరచి ఎంత అందముగా అలంకరించినను, రోమా సామ్రాజ్యము నుండి యూదా మతమును రక్షించుటకు గాక సాతాను నుండి పాపులను రక్షించుటకు ఆయన వచ్చెను ఏలయనగా ఆయన రాజ్యము ఈలోక సంబంధమైనది కాదు (యోహాను 18:36). ఆహారము కొరకు ఆకలి తీర్చుకొనుటకు ఆయన యొద్దకు వచ్చేవారు నిరుత్సాహముతో

తిరిగి పోవలసి వచ్చెను.

**ఆయన సంపన్నులను సిగ్గుపరచెను :**

యేసుప్రభువు పాపులతోను, సుంకరులతోను కలిసి భోజనము చేయుట వలన సంపన్నులు తిరుగుబాటు చేసిరి (మార్కు 2; లూకా 19). "నశించిన దానిని వెదకి రక్షించుటకు యేసువచ్చెను (లూకా 19:10). దానిని ఆయన అక్షరాల అనుసరించుటవలన ధర్మశాస్త్రోపదేశకులు అభ్యంతరపడిరి. ఆయన వారి విద్యాలయాల్లో దేనిలోను చదువకపోయినను ఆయన బోధలను వినుటకు ప్రజలు అసంఖ్యాకులుగా వచ్చుట వలన వారు ఆందోళనకు గురియ్యిుద్ధి (యోహాను 7). అతి సున్నిత పదజాలముతో, చాతుర్యముతో వారి వేషధారణను యేసు బహిర్గతము చేయుచుండినందున వారు తరుచు సిగ్గుపడవలసి వచ్చెను (మార్కు 12:24, 34; యోహాను 8:39,40).

తన తమ్ముని గూర్చికించెత్తు చింతించని పెద్ద కుమారుని గూర్చి చెబుతు ఆయన వారి హృదయములోని స్వార్థమును బట్టబయలు చేసారు (లూకా 15). మరియు మంచి సమరయుని గూర్చి చెబుతు యూదులు యొుక్క సంస్కార సంబంధమైన పై పై భక్తిని ఎత్తి చూపించారు. గాయపరచబడిన వానిని చూస్తూనే లేవీయుడు, యాజకుడు ప్రక్కనుండి వెళ్లిపోయారు (లూకా 10). వారు ఆయన వలన అభ్యంతరపడి ఆయనను చంపజూచారంటే, ఆశ్చర్యం లేదు. వారు మారుమనస్సు పొంద వచ్చును గాని వారికంత ధైర్యము లేకపోయింది. "ఆయనతన స్వకీయుల యొద్దకు వచ్చెను, ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదను" మాటలు విచారకరమైనవి. (యోహాను 1:11).

**పరిపూర్ణ రక్షకునికి మెండుగా శత్రువులు**

యేసుక్రీస్తు ప్రభువు లాంటి మంచి వ్యక్తికి అంతమంది శత్రువులుండడం ఊహకందనిది. ఆయన జీవించిన మనోహార జీవితం, నెలకొల్పిన మంచి మాదిరిని చూస్తే, ఆయన కాలమందలి ప్రజలు ఆయనను నిరాకరించుట చాలా ఆశ్చర్యం. అట్టి నిస్వార్ధ ప్రేమను ఎవరైనా ఎట్లు నిరాకరిస్తారు? అయినను నాటి వేలకొలది ప్రజలు

ఆయన మాటలు గైకొనినవారు కారు.

యేసు ఈ భూమిపై నడచినప్పుడు పరిసయ్యుల యొక్క ద్వేషము వివిధ రీతులగ ఏర్పడేది. వారు రోమా సామ్రాజ్యపాలకులతో కలిసి క్రీస్తును సిలువవేయించుటలో వారి విషద్వేషము పరాకాష్టకు చేరింది. యేసు జననము స్వాగతింపబడలేదు. జీవితమంతా వ్యతిరేకులే, ఆయన మరణం అనేకుల ఆశలకు అంకురార్పణ మయ్యింది. ఆయనకు అంతమంది శత్రువులెందుకు? ఆయనను ఎందుకు నిరాకరించారు? (గలతీ5:11;రోమా9:33; యోహాను 1:11).

**యేసు యొక్క లక్ష్యము ఈలోకం కాదు, పరలోకము :**

యేసు ప్రభువు భౌతిక సంగతులను గాక పరసంబంధ విషయాలపై ఆసక్తి కలిగి బోధించారు గనుక ప్రజలాయనను నిరాకరించారు. ఆయన కాలము నాటి యూదులు ఒక భౌతిక సంబంధ రాజ్యము కొరకు రాజు కొరకు ఎదురు చూచుచుండిరి. దావీదు సింహాసనముపై కూర్చుండు రాజును గూర్చిన పాతనిబంధన ప్రవచనములను వారు ఎరిగియుండిరి. ఆ మెస్సీయ రాజులకు రాజును ప్రభువులకు ప్రభువు నై యుండును (1తిమోతి 6:15). గాని భౌతిక విలువలపైనే వారి ఆసక్తి యున్నందున క్రీస్తు రాజ్యము ఎన్నడు భూసంబంధ మైనది కాదని గుర్తించలేక పోయారు.

యేసు యొక్క జీవితాన్ని బోధలను మనం లేఖనములలో పరీక్షించిన యెడల నాటి మతగురువుల యొక్క అపోహలను సులభముగా గ్రహించుకొనచ్చును. యూదులు ఒకానొక సందర్భములో ఆయనను బలవంతముగా రాజును చేయ్య ప్రయత్నించగా ఆయన వారినుండి తప్పించుకొని పోయారు (యోహాను 6). యేసు యొక్క సన్నిహిత శిష్యులు కూడ ఆయనను అపార్ధము చేసి కొన్నారు. అయినను ఆయన కైసరుకు పోటీదారుకాదని, ఆయన రాజ్యము ఇహసంబంధమైనది కాదని యేసు వక్కాణించారు (యెహాను 18:36). 'ఆయన శిష్యులలో అనేకులు ఈ మాట విని, యిది ఎవడు వినగలడని చెప్పుకొనిరి... అప్పటి నుండి అనేకులు వెనుక తీసి మరి ఎన్నడును ఆయనను వెంబడింపలేదు' (యెహాను 6:60,

66). కాబట్టి యేసు మీరు కూడ వెళ్ళిపోవలెనని యున్నారా?" అని తన శిష్యుల నడిగారు (యోహాను 6:67). ఈ ప్రజల మనస్సు ఎందువలన మార్చబడినది? ఒకప్పుడు వారు యేసు నామమును కొనియాడారు. గాని ఇప్పుడు వారు వెనుకదీసి మరెన్నడును ఆయనను వెంబడించ లేదు.

**యేసు అసత్యాన్ని, వేషధారణను ఖండించారు :**

యేసు భౌతిక రాజుగా యుండ గోరలేదు గనుక ఆయన నిరాకరింప బడ్డారు. ఆయన ఇహలోకము కంటే, పరలోక సంగతులను హెచ్చించారు. అపహాదితో పోరాడుచు ఆత్మీయ సంగతులను వక్కాణించారు. నాడున్న ప్రఖ్యాత యూదుల తెగల యొక్క మతపరమైన పారంపర్యాచారములను యేసు ఖండించారు. గనుక వారాయనను నిరాకరించారు. వారు తమ హృదయములతో గాక పెదవులతో దేవుని సేవించుచున్నారని ఆయన చెప్పారు. అట్టివారి ఆరాధన వ్యర్థమని చెప్పారు (మార్కు 7:6–7).

మన సమర్పణలో క్రీస్తుకును, ఆయన వాక్యమునకును వ్యత్యాస మున్నదని కొందరు చెప్పజూస్తారు. గాని ఆయన, ఆయన వాక్యము నిత్యము కలసి బంధింపబడియున్నవి. "నేను చెప్పినట్లుచేయక, ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?". "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొనుడి". "నేను మీకాజ్ఞాపించినవి చేసిన యెడల మీరు నాకు స్నేహితులై యుందురు". "ఆయన మీతో చెప్పునది చేయుడి" (లూకా 6:46, యోహాను 14:15, 15:14; 2:5).

యేసు నామమును ఒప్పుకొనుచు ఆయన చెప్పినట్లు చేయకపోతే అది ఘోరమైన వేషధారణ యగును. మనం యదార్థమైన ప్రేమకు విధేయతను కలిగియుండాలి. దేవుని కృపయు క్రీస్తు యొక్క సువార్తయు చేతిలో చేయివేసి నడువాలి. పౌలు "దేవుని కృపా సువార్తను" బోధిస్తునే యుండేవాడు (అపొ.కా. 20:24). మనము కూడ అట్లే చేయాలి. మనం యేసును ఘనపరచాలంటే ఆయన వాక్యాన్ని ఘనపరచాలి.

– జానీరామ్సే

కర్నూలు జిల్లా గోనెగండ్ల గ్రామములో యున్న క్రీస్తుసంఘము 2017 మే నెల 3,4,5 తేదీలలో తాము నూతనముగా నిర్మించుకొనిన ప్రార్ధన మందిరి ప్రారంభోత్సవ సందర్భముగా గొప్పసువార్త సభలు నిర్వహించిరి. అక్కడ 1971లో జి.మోజెస్ గారి ఆధ్వర్యమున 7గురితో క్రీస్తుసంఘము ప్రారంభము కాగా 1993లో  అయన మరణించిన నాటి నుండి సోదరులు యమ్. ప్రసంగి గారి నిర్విరామ కృషి వలన ఇప్పుడు 300 మందికిపైగా గోనెగండ్లలో ప్రభువును ఆత్మతోను సత్యముతోను ఆరాధించుచున్నారు.

మే 3వ తేదీ ఉదయం 10 గంటలకు జాలవాడి ఎలీషా గారి అధ్యక్షతన కార్యక్రమము ప్రారంభము కాగా ఐజయ్య గారు (కర్నూలు), జాన్ చార్లెస్ గారు (బెంగుళూరు) వరప్రసాద్ గారు (హైదరాబాద్) కె.సొలొమోను గారు (విజయనగరం), చిన్న రాజు గారు (గూడూరు) ప్రార్ధన పూర్వకముగా నూతనమందిర ప్రవేశంగావించిరి. ప్రతిరాత్రి 7 గం॥లకు సువార్త కూడికలు జరుగగా 2,3 వేలమంది హాజరై స్థానిక సంఘమును ఆశ్చర్యపరచిరి. పగటివేళ జరిగిన బైబిలు క్లాసులలో చిన్నరాజు గారు, వి.సహదేవ్ గారు (తాడేపల్లిగూడెం) వాక్యోపదేశము గావించిరి. ఆఖరిరాత్రి సభకు 6000 మందికి పైగా హాజరుకాగా వి.సహదేవ్ గారు చిన్నరాజు గారు వాక్యోపదేశము గావించిరి. వచ్చిన వారందరికి స్థానిక సంఘము గొప్ప విందు నేర్పాటు చేసిరి. ఆ మూడు దినములు ఆకాశము మేఘావృతమైయుండినను, వర్షముమాత్రము కురియలేదు. ప్రభువు పనికి ఆటంకము కలుగలేదు. సరిగదా 6వ తేదీ సాయంత్రము గాలి, వర్షము, మెరుపులతో ఆప్రాంతము దద్ధరిల్లగా ప్రజలందరు ప్రభువుకు ఘనతా, మహిమా ప్రభావములు చెల్లించిరి. కర్నూలు జిల్లాలో గోనెగండ్లలో యున్న మంచి సంఘము కొరకును, దానిని సమర్ధవంతముగా నడిపించుచున్న యం. ప్రసంగి గారి కొరకును, ఆ స్థానిక సంఘనాయకుల  కొరకును ప్రార్ధించమనవి.

2017 మే 10,11,12 తేదీలలో కాకినాడ మెక్లారిన్ హైస్కూలు ఆవరణములో తూర్పుగోదావరి జిల్లా క్రీస్తు సంఘములు ఏర్పాటుచేసిన సువార్త సభలు జయకరముగా జరిగినవి. ఆ కూటములలో సోదరులు యు. ఇశ్రాయేలు (ఇంకొల్లు) యం.జోయెల్ రాజు (పిఠాపురం), టి. జ్ఞానసుధీర్ (కాకినాడ), యం. జాన్‌డీన్ (సింగంపల్లి), పి.డి.బిషప్ (మండపేట) మరియు చుక్కా జాకబ్ (బెంగుళూరు) గార్లు వాక్యపరిచర్య చేసిరి. మరి ముగ్గురు సోదరులు క్లుప్తప్రసంగములు చేసిరి. శేషం ప్రభాకర్ గారి వందన సమర్పణ, ఎ.విశ్వేశ్వరరావ్ గారి ఆఖరిప్రార్థనతో సభలు ముగిసినవి. సోదరులు కె.మోజెస్ కుమార్, యస్. ప్రభాకర్, యీ. అబ్రహామ్ లింకన్ మరియు పి. బలరాం గార్లు సువార్తకూటముల నిర్వహణ భారమును తమ భుజస్కంధములపై వేసికొని సమర్థవంతముగా నడిపించిరి. దేవుడు వారిని ఆశీర్వదించును గాక!

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004